సంక్షేమ పాలనకు చిరునామా వైఎస్ జగన్

- ఉండి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు
- అర్తమూరు, చెరుకువాడ, కలిసిపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పీవీఎల్, వైఎస్సార్ సీపీ శ్రేణులు


కలసిపూడిలో మల్లిఖార్జున స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

ఉండి: ప్రజా సంక్షేమానికి చిరునామా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. బుధవారం మండలంలోని అర్తమూరు, చెరుకువాడ, కలసిపూడి గ్రామాల్లో పీవీఎల్ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వీధి వీధినా పీవీఎల్‌కు ప్రజలు హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలంటూ పీవీఎల్ ఓటర్లను అభ్యర్థించారు. భారీస్థాయిలో నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు కార్లు, బైక్ ర్యాలీలో పాల్గొనడంతో గ్రామాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా చెరుకువాడ, పెదపేట, చినపేట ప్రాంతాల్లో పీవీఎల్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అలాగే కలసిపూడిలో సీబీసీఎన్‌సీ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా స్వయంభూ భ్రమరాంభ మల్లిఖార్జునస్వామికి పీవీఎల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలంటే ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే జరుగుతుందని ప్రజలంతా నమ్ముతున్నారన్నారు. త్వరలో వైఎస్ జగన్ విడుదల చేయబోయే వైఎస్సార్‌సీపీ మ్యానిఫెస్టో కోసం ప్రజలంతా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారని.. ఎందుకంటే జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అనే నినాదం ప్రజల్లో ఉందని, అందుకే గత ఐదేళ్ల పాలన నిదర్శనమన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్ని మాయమాటలు చెప్పినా నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. ఈ ఎన్నికల్లో ఉండిలో వైఎస్సార్‌సీపీ గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరని, ఎందుకంటే ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలకు అర్థమైందని అన్నారు. అందుకే 175 సీట్లలో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కేశబోయిన జానకీ శ్రీనివాస్, కొండవేటి సాంబశివరావు (శివయ్య), జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కానుబోయిన సత్యనారాయణ, కొండవేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌లు కొరపాటి అనిత, గులిపల్లి అచ్చారావు, మునుకోలు సింహాచలం, రామదాసు, వెంకటేశ్వరరావు, పచ్చిగోళ్ళ శివ, బాతు మోషేష్‌రాజు, బీడిల్లి రవిరాజు, జ్ఞానరాజు, రామకూరి కర్నేలు, జాన్‌బాబు, ఎంపీటీసీ చిగురుపాటి కృష్టాఫర్, యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, బందెల ప్రమీల, బిల్‌మోరియా, బొడ్డు నాగన్న, బందెల జార్జ్, పరమేష్, వీరారెడ్డి, తాడేపల్లి రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, రణస్తుల మహంకాళి, గలావిల్లి ధనుంజయ, కమతం బెనర్జీ, గుండాబత్తుల సుబ్బారావు, ముదునూరి కొండరాజు, జీ సుందర్‌కుమార్, కరిమెరక శివనాగరాజు, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీను, రాయి సతీష్, బడుగు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

9 నామినేషన్ల దాఖలు

ఉండి: ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం 9 నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్‌ఆదిత్య తెలిపారు. వీరిలో అఖిల భారత జనసంఘ్ పార్టీ అభ్యర్థిగా ముదుండి రవివర్మ, స్వతంత్ర్య అభ్యర్థులుగా దిడ్ల ప్రేమ్‌కుమార్, ఇందుకూరి నవీన్‌కుమార్, వేగేశ్న సూర్యనారాయణరాజు, గాజుల శివ, తోటకూర సుధీర్‌వర్మ, నీతినిజాయితీ పార్టీ అభ్యర్థిగా పెన్మత్స శివరామరాజు, బీఎస్పీ అభ్యర్థిగా మల్లిపూడి షర్మిల, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా అల్లూరి సతీష్‌చంద్రకుమార్ తమ నామినేషన్లు సమర్పించినట్లు ఆయన తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు వేసేందుకు చివరి రోజు కనుక అభ్యర్థులంతా గమనించాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

టీడీపీకి ముచ్చెమటలు పట్టిస్తున్న శివ

ఉండి: మాజీ ఎమ్మెల్యే వీవీ శివరామరాజు టీడీపీకి ముచ్చెమటలు పట్టిస్తున్నారు. గురువారం ఆయన టీడీపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10.58 గంటలకు నామినేషన్ పత్రాలపై సంతకం చేసిన అనంతరం ఆయన స్వగ్రామం కాళ్ల మండలం కలవపూడి నుంచి భారీ ర్యాలీతో నామినేషన్‌కు వస్తున్నట్లు సమాచారం. నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున తన అభిమానులు, కార్యకర్తలతో నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. గురువారం మధ్యాహ్నం రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ అందిస్తున్నారని నాయకులు తెలిపారు. రెండుసార్లు ఉండి టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేసిన శివ గత సార్వత్రిక ఎన్నికల్లో నర్సాపురం ఎంపీగా పోటీ చేసి స్వల్పతేడాతో నాటి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి (రఘురామ కృష్ణంరాజు) చేతిలో ఓడిపోయారు. ఇప్పుడు తనకు టీడీపీ టిక్కెట్టు వస్తుందని చివరివరకు ఎదురు చూశారు. తనకు టిక్కెట్ ఇవ్వకపోవడమే కాకుండా వేరొకరికి టిక్కెట్ ఇస్తున్నట్లు చంద్రబాబు సమాచారం ఇవ్వకపోవడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. తనకు కనీస మర్యాద ఇవ్వని చంద్రబాబుకు టీడీపీ రెబల్ అభ్యర్థిగా తన తడాకా చూపిస్తానని భీష్మించారు. దీంతో ఆయన్ను బుజ్జగించేందుకు టీడీపీ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. తనకు జరిగిన అవమానంపై మండిపడుతున్న శివ టీడీపీకి తగిన బుద్ధి చెబుతానంటూ రెబల్ అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేస్తున్నట్లు సమాచారం.

12 మంది వలంటీర్ల రాజీనామా


పాములపర్రులో రాజీనామా చేసిన వలంటీర్లు

ఉండి: మండలంలోని పాములపర్రు గ్రామానికి చెందిన 12 మంది వలంటీర్లు బుధవారం రాజీనామాలు చేశారు. తమ రాజీనామాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలకు అందజేయడంతోపాటు కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన తమపై టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తట్టుకోలేక రాజీనామా చేసినట్లు చెప్పారు. ఇకపై తామంతా జగనన్నకు తోడుగా ఉంటామని, వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

రామ్‌కిషోర్‌కు నియుక్తి ఆచార్య అవార్డు


నియుక్తి ఆచార్య అవార్డునందుకుంటున్న రామ్‌కిషోర్

భీమవరం: భీమవరం పట్టణంలోని డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సీహెచ్ రామ్ కిషోర్‌కు ఎబిసిటిఇ భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్సు నియుక్తి ఆచార్య అవార్డ్‌ను ప్రధానం చేశారు. ఈసందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకటనర్సింహారాజు, గాదిరాజు సత్యానారాయణరాజు(బాబు) మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో రామ్‌కిషోర్ సేవలు ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు ఉద్యోగం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను నేర్పించటంలో కిషోర్ పట్టుదల, కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని మరింత చేరువ చేయాలి


విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ బైస్కిల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

భీమవరం: ఇంజనీరింగ్ విద్యార్థులు మల్టీ డిస్పినరీ ప్రాజెక్టులు చేపట్టి భవిష్యత్తులో సమాజానికి టెక్నాలజీని మరింత చేరువ చేసే విధంగా పరిశోధనలు ఉండాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు అన్నారు. బుధవారం కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు నల్లమిల్లి శ్రీవల్లి, లంకపల్లి లలితా భవాని, పప్పుల జాహ్నవి, పడాల వీర మనోజ్, నట్ల శ్రీకర్ సాధారణ సైకిల్‌కు లితుమిని బ్యాటరీ సైకిల్ దొడ్డిపైన ఏర్పాటుచేసి బ్యాక్ వీల్‌కు మోటార్ ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ బైస్కిల్‌ను పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఎలక్ట్రిక్ బైస్కిల్‌ను తయారు చేయడానికి కేవలం రూ.15 వేలు ఖర్చు అయిందని ఒకసారి చార్జింగ్ పెడితే 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చునని విద్యార్థులు వివరించారు. కళాశాల ఈఈఈ విభాగం హెడ్ బిఆర్‌కే వర్మ, ప్రాజెక్ట్ ఎక్స్‌పో కోఆర్డినేటర్ జి శ్యామ్‌నరేష్ పాల్గొన్నారు.

మేమింతే ఎవరి మాటా వినం

- జనసేన నామినేషన్ కార్యక్రమంలో నిబంధనలకు విరుద్ధంగా కేడర్
- అనుమతి లేదని చెప్పినా వినకుండా పోలీసులతో తోపులాట
- బైక్‌ల సైలెన్సర్లు విప్పి శబ్దకాలుష్యంతో ప్రజలను బెంబేలెత్తించిన వైనం
- జనం మధ్యలో మందుగుండు పేలి గందరగోళం
- నామినేషన్‌కు అంతగా హాజరుకాని టీడీపీ, బీజేపీ కేడర్


జనసేన అభ్యర్థి అంజిబాబు నామినేషన్ కార్యక్రమంలో దూసుకువస్తున్న నాయకులను బారికేడ్ల వద్ద అడ్డుకుంటున్న పోలీసులు

భీమవరం: మేమింతే.. ఎవరి మాటా వినం.. అంటూ జనసేన నాయకులు, కార్యకర్తలు భీమవరంలో రెచ్చిపోయారు. నామినేషన్ వేసే ప్రాంతమైన ఆర్డీవో కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో వెళ్లడానికి వీలులేదంటూ పోలీసులు అడ్డుపడినా లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. సీఐ, ఎస్సై స్థాయి అధికారులను కూడా తోసుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా ముందుకు వెళ్లారు. ర్యాలీలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించి ప్రజలు, ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కల్పించారు. ఇదంతా భీమవరం నియోజకవర్గ జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) నామినేషన్ సందర్భంగా బుధవారం చోటుకుంది. నామినేషన్‌కు ముందుగానే జనసేన పార్టీ కార్యాలయం నుంచి ప్రత్యేకంగా నోట్ విడుదల చేశారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని, మోటారు సైకిళ్ల సైలెన్సర్లు విప్పి రాద్ధాంతం చేయవద్దని జనసేన అభ్యర్థి అంజిబాబు వేడుకున్నా ఎవరూ లెక్కచేయలేదు.

నిబంధనలు అతిక్రమించి పోలీసులను గెంటుకుంటూ..

నామినేషన్ కేంద్రమైన ఆర్డీవో కార్యాలయానికి పరిమిత సంఖ్యలో మాత్రమే వెళ్లాలనే నిబంధనలున్నాయి. ఆర్డీవో కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి.. నిబంధనల ప్రకారం అభ్యర్థితో పాటు సపోర్టు చేసే వ్యక్తులు మాత్రమే వెళ్లాలని సూచించారు. అయితే దీనికి భిన్నంగా జనసేన నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా లోపలకు వెళ్లడానికి తోసుకువచ్చారు. దీంతో వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను, ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందితో వారిని నిలువరించేందుకు ప్రయత్నించినా వారిని తోసుకుంటూ ముందుకు వెళ్లారు. ఇక ర్యాలీలో భాగంగా కాల్చిన బాణసంచా జనం మధ్యలో పేలడంతో భయంతో జనం పరుగులు పెట్టారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు ఆ శబ్దానికి చెవులు వినిపించక ఇబ్బంది పడ్డాడు. అయినా అతన్ని ఎవరూ పట్టించుకోలేదు.

మిత్రపక్షాల మద్దతు అంతంతే...

భీమవరంలో జనసేన అభ్యర్థి అంజిబాబు పోటీ చేస్తుండగా, పార్టీ నేతల మధ్య విభేదాల కారణంగా మిత్రపక్షాలైన టీడీపీ, బీజేపీ నేతలు పాల్గొనలేదు. కొద్దిమాత్రమే నామమాత్రంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఐదేళ్లుగా ప్రజలకు కనిపించని అంజిబాబుకు ఎలా మద్దతిస్తామంటూ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.

డీఎన్నార్ స్కూల్లో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు


ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాదరాజు

భీమవరం: భీమవరం బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమంలో బీవీ రాజు కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పీవీఎస్ స్వామి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు విద్యను నిర్లక్ష్యం చేయకుండా ఇంగ్లీష్ సబ్జెక్టులో ప్రతిభ సాధించడానికి స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఫౌండేషన్ సహకారంతో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని శిక్షణా తరగతులకు పట్టణంలోని వివిధ స్కూల్స్ నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ పట్టాభి రామయ్య, కోశాధికారి పి సీతారామరాజు, డీఎన్నార్ కళాశాల సంయుక్త కార్యదర్శి కూనపరాజు రామకృష్ణంరాజు, స్కూల్ హెచ్ఎం లక్ష్మీకుమారి, కోఆర్డినేటర్ మంతెన వెంకటరామరాజు, నిర్మలాదేవి, అల్లు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కామాక్షమ్మ జాతర

యలమంచిలి: మేడపాడులోని బాలం వారి పుంతలో ఉన్న కామాక్షమ్మ అమ్మవారి జాతర మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులు, గరగల నృత్యాల నడుమ అమ్మవారి ఘటాలను గ్రామ వీధులలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద బాలం వీరరాఘవలు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

జోరుగా వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం


ఆకివీడు సంతపేటలో ప్రచారం చేస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి


మాదివాడలోని గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న పుప్పాల పండు, అంబటి రమేష్


పెద అమిరంలో ప్రచారం చేస్తున్న కోపల్లె సొసైటీ అధ్యక్షుడు జయరామకృష్ణంరాజు

ఆకివీడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలను జనం మెచ్చారని, అందుకే మళ్లీ ఆయనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక సంతపేటలో బుధవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అలాగే మాదివాడలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్, పంచాయతీ వీధిలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, కోఆప్షన్‌సభ్యురాలు మన్నే లలితాదేవి, అజ్జమూరులో సర్పంచ్ చెలంకూరి చలపతి, పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

పీవీఎల్‌ను గెలిపించాలి

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనమంతా ఉన్నారని కోపల్లె సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ వేగేశ్న జయరామ కృష్ణంరాజు తెలిపారు. ఉండి ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహరాజును గెలిపించాలని కోరుతూ బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు పొందిన ప్రతి మహిళ వైఎస్ జగన్‌కు ఓటేస్తారని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. పార్టీ నాయకులు సుబ్బరాజు, బిరుదుగడ్డ రమేష్, సంసోను, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొడ్డనపూడిలో ప్రచారం

దొడ్డనపూడిలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహరాజును ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు గుండా సాయి, కొల్లి రామకృష్ణ, ఇర్రింకి వీర రాఘవులు ఎంపీటీసీ ఇర్రింకి జగన్, దేవి వరప్రసాద్, మైనం పద్మారావు, కొల్లి వెంకట రామారావు, శ్రీకాంత్, కొల్లి చిన్న పేరయ్య, దానం వెంకటేశ్వర్లు, కొవ్వాడ చిట్టిబాబు తెనాలి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల స్టాండింగ్ కమిటీ సమావేశం

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలు దాటితే అనర్హులుగా ప్రకటిస్తామని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పర్యాటక శాఖ రీజనల్ కో ఆర్డినేటర్ వి స్వామి నాయుడు తెలిపారు. బుధవారం ఆచంటలోని కార్యాలయంలో రాజకీయ పార్టీలతో ఐదో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించి అభ్యర్థుల ఎన్నికల ఖర్చులకు, ఖాతా నిర్వహించే విధానాన్ని, అభ్యర్థి ఎన్నికల వ్యయాల అకౌంట్ సమర్పించడానికి గానూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. ఎన్నికల ఖర్చు కోసం ప్రతి అభ్యర్థీ విడిగా బ్యాంక్ అకౌంట్ ప్రారంభించాలన్నారు. నామినేషన్ పత్రాల దాఖలు చేసినప్పటి నుంచి ఎన్నికల ఖర్చుకు సంబంధించి, రిజిష్టర్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశానికి పార్టీల ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

చురుగ్గా కొత్తోట - కోమటితిప్ప రహదారి పనులు

మొగల్తూరు: మండలంలోని కొత్తోట-కోమటితిప్ప రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొత్తోట, కోమటితిప్ప, నీటితిప్ప, జిల్లేడుతిప్ప గ్రామాలకు సంబంధించి రూ.9 కోట్లు మంజూరు కాగా ఎన్నికల కోడ్ రాకముందు రహదారి పనులకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. నాలుగు గ్రామాలను కలుపుతూ సుమారు 17 కిలో మీటర్ల మేర చేపట్టిన రోడ్డు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే నీటితిప్ప, జిల్లేడుతిప్ప రహదారి పనులు దాదాపుగా పూర్తికాగా కొత్తోట, కోమటితిప్ప రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నాలుగు గ్రామాలకు సంబంధించి వేలాది ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులున్నాయి. దీంతో నిత్యం వందలాది లారీలు నాలుగు గ్రామాల మధ్య తిరుగుతూ ఉంటాయి. రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా నిర్మించాలని గతంలోనే ఆదేశించడంతో అందుకు అనుగుణంగా పనులు చేస్తున్నారు.